


చంద్రబాబు, లోకేశ్ పర్యటనలు రద్దు

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ నరసన్నపేట, మే 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పర్యటనలు రద్దయ్యాయి. ముందుగా షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు ఈ నెల 9న నరసన్నపేటలో ప్రజాగళం పేరిట సభలో పాల్గొనాల్సి ఉంది. అలాగే ఈ నెల 7న (మంగళవారం) శ్రీకాకుళంలో లోకేశ్ ఆధ్వర్యంలో 'యువగళం' కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. కాగా బిజీ షెడ్యూల్ వల్ల చంద్రబాబు, లోకేశ్ పర్యటనలు రద్దయ్యాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ(కూటమి) అభ్యర్థి బగ్గు రమణమూర్తి తెలిపారు.

వైసీపీ బరి తెగింపు

- కూన రవికుమార్ సతీమణిపై కత్తితో దాడి
- అడ్డుకున్న కారు డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- ప్రచారంలో ఉండగా వైసీపీ కార్యకర్త ఘాతుకం
- ఇటీవల ఎన్‌జీఆర్‌పురం పంచాయతీలోనూ అధికారపార్టీ దాడులు
- టీడీపీ, జనసేన నాయకులే లక్ష్యంగా చేసుకుని..
- ఓటమి భయంతోనే దాడులు చేస్తున్నారని టీడీపీ ఆరోపణలు
- ఇది సీతారాం ప్రేరేపిత చర్యేనంటున్న 'కూన'





రణస్థలం : చీకటిపేటలో వైసీపీ శ్రేణుల రాళ్లదాడిలో గాయపడిన కొమర నూకయ్య, సత్తమ్మ (ఫైల్)



గాయపడిన కారు డ్రైవర్ కసవయ్య



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న క్షతగాత్రుడు కసవయ్య, టీడీపీ నేతలు

పొందూరు: ఎన్నికలవేళ వైసీపీ శ్రేణులు బరితెగిస్తున్నాయి. విపక్షాల నాయకులను టార్గెట్ చేసుకుంటున్నాయి. మారణాయుధాలతో దాడికి తెగపడుతున్నాయి. భయభ్రాంతు లకు గురి చేస్తున్నాయి. అంతులేని ప్రజావ్యతిరేకత మూటగట్టుకుని.. ఓటమి భయం వెంటాడుతున్న తరుణంలో.. దేనికైనా సిద్ధపడుతున్నాయి. తాజాగా టీడీపీ అభ్యర్థి సతీమణిపై కత్తితో దాడికి దిగడం తీవ్ర కలకలం రేపింది. పది రోజుల క్రితం రణస్థలం మండలం ఎన్‌జీఆర్ పురం పం చాయతీ పరిధిలో టీడీపీ, జనసేన నాయకులపై వైసీపీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. ఈ ఘటన మరువకముందే సోమవారం రాత్రి పొందూరు మండలం మజ్జిలపేటలో ఆముదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీలపైనే కత్తితో దాడికి ప్రయత్నించారు. అడ్డుకున్న ప్రమీల కారుడ్రైవర్ చేతికి తీవ్రగాయాలయ్యాయి. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేశారు. సోమవారం కూన ప్రమీల మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. రాత్రి 8 గంటల సమయంలో కోటిపల్లి పంచాయతీ మజ్జిలపేట గ్రామానికి వెళ్లారు. ప్రజలను ఓట్లు అడుగుతుండగా కొందరు వైసీపీకి చెందినవారు టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అయినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారిని పట్టించుకోకుండా ప్రచారం చేసుకుంటూ వెళ్తున్నారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతే.. అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గురుగుబెల్లి రమణ కత్తితో కూన ప్రమీలపై దాడికి దిగాడు. దీంతో అప్రమత్తమైన ప్రమీల కారుడ్రైవర్ సింగూరు కసవయ్య అడ్డుకోవడంతో అతని చేతికి తీవ్ర గాయమైంది. టీడీపీ నాయకులు రమణను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కసవయ్యకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి యత్నించిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదుచేయాలని ఎస్‌ఐ రవికుమార్‌ను టీడీపీ నాయకులు సీహెచ్ రామ్మోహన్, కె.సత్యనారాయణ, ఎ.రాము, బి. శంకరభాస్కర్, డి.సన్యాసిరావు కోరారు.



మజ్జిలపేటలో ప్రచారం చేస్తున్న కూన ప్రమీల

పది రోజుల క్రితం రణస్థలం మండలంలో..

ఎన్‌జీఆర్‌పురం పంచాయతీ పరిధిలో చీకటిపేట, గురయ్యపేట, పాతయ్య పేట తదితర మత్స్యకార గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో టీడీపీ, జనసేనపార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉంది. సుమారు 1,450మంది ఓటర్లు ఉన్నారు. అయితే స్థానికంగా ఈ పార్టీలకు సరైన నాయకత్వం లేదు. ఈసారి పొత్తులో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయించగా.. కూటమి తరపున బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నడుకుదుటి ఈశ్వరరావు తరపున ఎన్నికల ప్రచారానికి, పార్టీ కార్యక్రమాలకు ఈ పంచాయతీ నుంచి జనసేన, టీడీపీ సానుభూతిపరులు హాజరవుతున్నారు. దీంతో వీరిపై వైసీపీ నేతలు, కార్యకర్తలు పది రోజుల కిందట దాడులకు తెగబడ్డారు. భయభ్రాంతులకు గురి చేశారు. బాధితులు ప్రశ్నిస్తే.. 'మమ్మల్నే ఎదిరిస్తారా?' అంటూ బెదిరించారు. దీంతో చాలా కుటుంబాలు గ్రామాలను విడిచిపెట్టి వేరే గ్రామాల్లో తలదాచుకుంటున్నాయి. ఈ ఘటనలపై ఫిర్యాదులు వెళ్లడంతో ఆ గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అయినా ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన సానుభూతిపరులు భయభయంగానే ఉంటున్నారు.

ఇది సీతారాం ప్రేరేపిత చర్యే: కూన రవికుమార్

ఎన్నికల ప్రచారంలో ఉన్న తన సతీమణిపై కత్తితో దాడి వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం చర్యేనని టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ ఆరోపించారు. వైసీపీ హత్యా రాజకీయాలకు ఈ ఘటనే నిదర్శనమని మండిపడ్డారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించి ఇలాంటి ఘటనలకు కూడా వెనుకాడటలేదని, ఇంత నీచమైన చర్యలకు పాల్పడాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు, ప్రభుత్వం మహిళలపైనా దాడులకు, హత్యలకు వెనుకాడడం లేదని విమర్శించారు. దాడులు, హత్యలతో ప్రజలను భయభ్రాంతులను చేయడానికి వైసీపీ యత్నిస్తోందని ఆరోపించారు.

అడ్డుకోకుంటే ఘోరం జరిగేది..

మజ్జిలపేటలో కూన ప్రమీల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. కొంత మంది రెచ్చగొట్టేలా మాట్లాడారు. కానీ మా పని మేము చేసుకుంటూ పోతుంటే.. వైసీపీ కార్యకర్త గురుగుబెల్లి రమణ ఒక్కసారిగా కత్తితో దాడిచేశాడు. డ్రైవర్ అప్రమత్తమై అడ్డుకోకుంటే ఘోరం జరిగేది.

-సీహెచ్ రామ్మోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు, పొందూరు

ప్రణాళికలో భాగంగానే విద్యుత్‌ను నిలిపేశారు..

కూన ప్రమీల.. సోమవారం రాత్రి మజ్జిలపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి 8 గంటల సమయంలో వైసీపీ నేతలు ప్రణాళికలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఆపై దాడికి యత్నించారు. ఓటమి భయంతోనే ఈ విధంగా పాల్పడ్డారు.

-అన్నెపు రాము, ఏఎంసీ మాజీ చైర్మన్, పొందూరు

ఇంకా అందలే!

- కొనసాగుతున్న పింఛన్‌దారుల కష్టాలు
- 1,464 మందికి ఈ నెల అందని డబ్బులు
- బ్యాంకుల చుట్టూ వందలాది మంది ప్రదక్షిణలు
- ఖాతా లావాదేవీలు నిలిచిపోవడంతో అవస్థలు
- ఎండల తీవ్రతతో ఇక్కట్లు.. ప్రభుత్వంపై ఆగ్రహం



జలుమూరు మండలం గుగ్గిలి పంచాయతీకి చెందిన ఈ వృద్ధురాలి పేరు **బొడ్డల సాయమ్మ**. ఈమె సామాజిక పింఛన్ కోసం సచివాలయం వద్ద వాకబు చేశారు. నరసన్నపేట బ్యాంకులో జమయినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు సోమవారం కుటుంబ సభ్యుడి సాయంతో నరసన్నపేటలోని బ్యాంకుకు వెళ్లి పింఛన్ కోసం ఆరాతీయగా.. డబ్బులు జమకాలేదని సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె లబోదిబోమన్నారు. రూ.200 ఖర్చు పెట్టుకుని బ్యాంకుకు వస్తే.. తమకు పింఛన్ డబ్బు జమకాకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.



పురుషోత్తపురంలోని బ్యాంకులో పింఛన్‌దారుల నిరీక్షణ

(నరసన్నపేట/ టెక్కలి/ సరుబుజ్జిలి)

వైసీపీ ప్రభుత్వ నిర్వాహకంతో సామాజిక పింఛన్ దారులకు కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర సామాజిక పింఛన్‌దారులు 3,20,913 మంది ఉన్నారు. వీరిలో ఈ నెల 1,464 మందికి పింఛన్ల సొమ్ము అందలేదు. ప్రభుత్వం ఈ నెల పింఛన్ డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. కాగా.. కొంతమంది బ్యాంకు ఖాతాలు లావాదేవీలు జరగని కారణంగా.. యాక్టివ్‌గా లేవు. దీంతో వాటిని యాక్టివ్ చేయించేందుకు, కేవైసీ కోసం బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. పింఛన్ల నగదు కోసం బ్యాంకుల చుట్టూ నాలుగైదు



నరసన్నపేటలో బ్యాంకు వద్ద..

రోజులుగా తిరుగుతూనే ఉన్నారు. సోమవారం నరసన్నపేట, మబుగాం, బుడితి, సారవకోట, టెక్కలి తదితర ప్రాంతాల్లో బ్యాంకుల వద్ద పింఛన్‌దారుల రద్దీ కనిపించింది. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలోని విశాఖ గ్రామీణ బ్యాంకులు పలువురు పింఛన్‌దారులు గంటల తరబడి నిరీక్షించారు. చాలా మంది వృద్ధులు మండుటెండలో రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడ్డారు. అయినప్పటికీ కొంతమందికి పింఛన్ డబ్బులు అందకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. 50మందికిపైగా పింఛన్లు పంపిణీ కాని మండలాలను పరిశీలిస్తే.. కవిటి, ఎచ్చెర్ల, నందిగాం మండలాల్లో 51 మందికి చొప్పున, టెక్కలి, పాతపట్నం మండలాల్లో 58 మందికి చొప్పున, మెళియాపుట్టి మండలంలో 63 మందికి, మందస మండలంలో 64మందికి, కొత్తూరు మండలంలో 68 మందికి పింఛన్లు పంపిణీ చేయలేదు. ఇలా ప్రతి మండలంలోనూ పింఛన్ దక్కని బాధితులు ఎందరో ఉన్నారు. సచివాలయ సిబ్బంది ఫోన్లలో ఆదివారం అర్ధరాత్రి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక యాప్‌ను తొలగించారు. దీంతో పింఛన్ల కోసం ఆయా లబ్ధిదారులంతా సచివాలయ సిబ్బందిని అడిగినా స్పష్టమైన సమాధానం కరువవుతోంది. వచ్చే నెల అయినా.. తమకు పింఛన్ అందుతుందో లేదోనని వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ విషయమై డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ప్రస్తుతం ఎంసీసీ పరిధిలో ఉన్నందున దీనిపై మాట్లాడకూడదని చెప్పారు.



తామరాపల్లికి చెందిన ఈయన పేరు **కోల లక్ష్మీనారాయణ**. మూడురోజులుగా వృద్ధాప్య పింఛన్ కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. కేవైసీ చేయలేదని.. మీ ఖాతాలో కొంత నగదు జమ చేస్తే.. పింఛన్ సొమ్ము ఇస్తామని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీంతో మళ్లీ ఆయన ఇంటికెళ్లి వచ్చి కొంత సొమ్మును జమచేసి బ్యాంకు ఖాతాను యాక్టివ్ చేయాల్సి వచ్చింది.



నరసన్నపేట హనుమాన్‌నగర్‌కు చెందిన ఈమె పేరు **గుట్ల నీలమ్మ**. ఈమె సామాజిక పింఛన్ కోసం నరసన్నపేటలోని బ్యాంక్‌కు వెళ్లగా.. ఖాతా యాక్టివ్‌లో లేదని సిబ్బంది తెలిపారు. బ్యాంకు ఖాతాలో కొంత నగదు వేస్తే.. పింఛన్ సొమ్ము చెల్లిస్తామన్నారు. దీంతో ఆమె కొంత నగదు చెల్లించి.. బ్యాంకు ఖాతాను యాక్టివ్ చేయించారు.



అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరిన మొఖలింగాపురం గిరిజనులు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

- అచ్చెన్నాయుడు సమక్షంలో భారీగా చేరికలు

టెక్కలి, మే 6: టెక్కలి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. సోమవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వారికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని, కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడాలని కోరారు. టీడీపీలో చేరిన వారిలో టెక్కలి మండలం మొఖలింగాపురం పంచాయతీకి చెందిన వలంటీర్ జన్ని కాంతారావుతోపాటు 20 కుటుంబాలు ఉన్నాయి. అయోధ్యపురానికి చెందిన వార్డుసభ్యులు కంచరాన యోగి, బగాది శ్రీనివాసరావు, వలంటీర్లు ముద్దాడ చిన్నారావు, బగాది ప్రతాప్, కంచరాన కవిత, పీఏసీఎస్ డైరెక్టర్ గొల్లపల్లి అశోక్ కుమార్‌తోపాటు తదితర 35 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కోటబొమ్మాళి మండలం ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన 50 దళిత కుటుంబాలు, కురుడు పంచాయతీ ఎరకయ్యపేట గ్రామస్థులు టీడీపీలో చేరారు.

మద్యం అక్రమ రవాణాకు పటిష్ఠ చర్యలు

శ్రీకాకుళం క్రైం, మే 6: ఎన్నికల వేళ.. జిల్లాలో మద్యం అక్రమ రవాణాకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మార్చి 16న ఎన్నికల కోడ్ వెలువడగా.. ఇప్పటివరకూ 27 మద్యం అక్రమ తరలింపు కేసులు నమోదు చేశాం. 21 మందిని అరెస్టు చేశాం. 146 లీటర్ల మద్యం సీజ్ చేశాం. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి రాజకీయ నేతల ర్యాలీలో తిరిగిన ఐదుగురు సూపర్‌వైజర్లు, 16 మంది సేల్స్‌మన్‌లను తొలగించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నాం. పోలింగ్ సమయానికి 48గంటల ముందు మద్యం దుకాణాలు, బార్లు, డిఫెన్స్ క్యాంటీన్లు, బీరు తయారీ కేంద్రాలు, కల్లు దుకాణాలను మూసివేయించి డ్రైడే ప్రకటిస్తామ'ని సుబ్బారావు వివరించారు.

ఉద్యోగులపై వైసీపీ ఒత్తిడి

- పోస్టల్ బ్యాలెట్‌లో తమకు సహకరించాలని విజ్ఞప్తి
- మరోవైపు సుతిమెత్తగా బెదిరింపులు

(ఆమదాలవలస)

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో.. ఉద్యోగులపై వైసీపీ నేతలు ఒత్తిడి పెంచుతున్నారు. తమ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలంటూ ఫోన్ల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నారు. పోస్టల్‌బ్యాలెట్ సమీపంలో శిబిరాల వద్ద కూడా మరికొంతమంది వైసీపీకి ఓటు వేయాలంటూ సూచిస్తున్నారు. ఆమదాలవలసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఓటింగ్‌లో పాల్గొంటున్న ఉద్యోగులపై వైసీపీ నేతలు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్‌లో అధిక శాతం మంది ఉద్యోగులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు తెలుపుతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. దీంతో వైసీపీ నేతల్లో గుబులు రేగుతోంది. ఇంకా రెండు రోజులపాటు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరగనుండడంతో.. తమకు అనుకూలంగా ఓట్లు పడేలా వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రానున్నది తమ ప్రభుత్వమేనని.. భవిష్యత్‌లో బదిలీలు, పదోన్నతులు అనుకూలంగా రావాలంటే వైసీపీకి ఓటు వేయాల్సిందేనని సుతిమెత్తంగా బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

పోలింగ్ కేంద్రం వద్ద వాగ్వాదం

ఆమదాలవలసలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద సోమవారం వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య చిన్నపాటి వాగ్వాదం నెలకొంది. మూడు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొంటున్న ఉద్యోగులను ఇరు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. శనివారం 988 మంది, ఆదివారం 1397 మంది, సోమవారం 243 మంది ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు. కళాశాల ముఖద్వారం వద్ద ఉన్న ఇరుపార్టీలకు చెందిన వ్యక్తులు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు.



ఇరువర్గాలనూ చెదరగొడుతున్న పోలీసులు



శ్రీకాకుళంలో హోం ఓటింగ్..

విజయవంతంగా హోం ఓటింగ్

కలెక్టరేట్, మే 6: జిల్లాలో సోమవారం నిర్వహించిన హోమ్‌ఓటింగ్ ప్రక్రియ విజయవంతంగా సాగింది. జిల్లావ్యాప్తంగా 494 మంది హోమ్ ఓటర్లు ఉండగా.. 474 మంది తమ ఇళ్ల వద్దనే ఓటుహక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా నరసన్నపేట నియోజకవర్గంలో 115 మందికిగాను 110 మంది ఓటేశారు. పలాస, పాతపట్నం నియోజకవర్గాల్లో శతశాతం హోమ్ ఓటింగ్ జరిగింది. జిల్లాలో మొత్తం 20మంది ఓటుహక్కును వినియోగించుకోకపోగా వారిలో 12మంది చనిపోయారు. మిగిలిన 8 మంది అందుబాటులో లేరు. శతశాతం ఓటింగే లక్ష్యంగా అధికారులు వేసిన ప్రణాళికలు సఫలమయ్యాయని చెప్పొచ్చు.

ఉరుములు.. మెరుపులతో వర్షం

- చల్లబడిన వాతావరణం
- జిల్లావాసులకు కాస్త ఉపశమనం



హరిపురంలో కురుస్తున్న భారీ వర్షం



మెళియాపుట్టిలో..

(పలాస రూరల్/ ఇచ్ఛాపురం/ హరిపురం/ వజ్రపుకొత్తూరు/ పాతపట్నం/ మెళియాపుట్టి/ టెక్కలి)

జిల్లాలో ఉరుములు.. మెరుపులతో సోమవారం సాయంత్రం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. పలాస, ఇచ్ఛాపురం, హరిపురం, వజ్రపుకొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి తదితర మండలాల్లో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. నెలరోజుల నుంచి తీవ్ర వడగాల్పులతో అల్లాడిన ప్రజలకు.. ఈ వర్షంతో ఉపశమనం లభించింది. బావులు, చెరువుల్లో నీరు చేరడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా ఈదురుగాలుల ప్రభావానికి కొన్ని ప్రాంతాల్లో మామిడికాయలు నేల రాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. అలాగే వజ్రపుకొత్తూరు మండలం చినవంక పంచాయతీ గుల్లలపాడు కాలనీలో వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

ఈదురుగాలుల బీభత్సం

టెక్కలి, నందిగాం మండలాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. కొండతెంబూరు, తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. పాలవలస పెట్రోల్ బంక్ ఆవరణలో డిస్‌ప్లేలు నేలకూలి దెబ్బతిన్నాయి. టెక్కలిలో విద్యుత్ స్తంభాలపై చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బెండకాయలపేట సమీపంలో విద్యుత్ వైర్లపై చెట్టు పడడంతో మొఖలింగాపురం, నర్సింగపల్లి పంచాయతీ పరిధి విద్యుత్ సరఫరా నిలిపేశారు.



నందిగాం : పాలవలస పెట్రోల్ బంక్ వద్ద దెబ్బతిన్న డిస్‌ప్లే



టెక్కలిలో సోమవారం రాత్రి కురుస్తున్న వర్షం



పాతపట్నంలో వర్షం



ఓటరన్నా మేలుకో!



- ఐదేళ్ల గురించి ఆలోచించు ● మంచిచేసే వారినే ఎన్నుకో
- నోటుకు ఆశపడితే.. భవిష్యత్తును తాకట్టు పెట్టినట్టే..
- నీతిగా ఓటు వేయాలి ● పనిమంతులకు పట్టం కట్టాలి

(హరిపురం)

ప్రజలకు మంచి పాలన అందాలంటే ప్రతినిధులు కూడా మంచి వారై ఉండాలి. ప్రజలపై విజన్ కలిగిఉండాలి. వారిని కుటుంబ సభ్యులుగా భావించాలి. వారికి కష్టమొస్తే తనకే వచ్చిందన్నట్లుగా అనుకునే మనస్తత్వం ఉండాలి. ఫలానాచోట పని కావట్లేదు.. కావాలనే ఇబ్బందికి గురిచేస్తున్నారని ఓ సామాన్యుడు చెప్పినా.. పెడచెవిన పెట్టకుండా 'పద నీతో వస్తా' పనెందుకు కాదో అన్న వ్యక్తి నాయకుడు కావాలి. 'మీకు నేనున్నానన్న' భరోసా కలిగించేలా పనిచేయాలి. ఇటువంటి ప్రతినిధి మనకు దొరకాలంటే మనమూ న్యాయంగా ఓటేయాలి. నాయకులిచ్చే పచ్చ నోట్లకు ఆశపడి, కులం మతం పేరు చెప్పి ఓట్లు అడిగే నాయకులకు గుడ్డిగా ఓటు వేస్తే అవస్థలు తప్పవు. పచ్చగా కళకళలాడుతున్న రాష్ట్రం రావణ కాష్టంగా మారక తప్పదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలకు లొంగకుండా ఐదేళ్ల గురించి ఆలోచించి ఓటు వేయాలి. వారిచ్చిన నోటు ఖర్చయిపోతుంది. ఓటు కూడా మురిగిపోతుంది. ఇప్పుడు కొనుగోలు చేసి, వారు గెలిచిన తర్వాత అప్పుడు తప్పించుకుంటారు.

ఎందుకా డబ్బులు?

ఎన్నికలు అనగానే డబ్బున్నోళ్లు, అక్రమంగా వేలకోట్లు వెనకేసుకున్నవాళ్లు.. రంగంలోకి దిగుతున్నారు. పని చేసే వాళ్లను వెనక్కినెట్టేస్తున్నారు. భిక్షకుడికి రూపాయి ఇవ్వని వారెందరో నాయకులుగా మారి జనాల్లోకి ఓట్ల కోసం రావడం అలవాటైంది. అవసరమైతే ఓటుకు రూ. 5వేలు ఇస్తుంటారు. అయితే వారిచ్చే డబ్బులకు ఓటువేస్తే మాత్రం ఐదేళ్లపాటు అవస్థలు తప్పవు. గతంలోకి వెళ్లి ఆలోచిస్తే ఇలా డబ్బులు పంపిణీ చేసిన చాలామంది గెలిచాక ప్రజలకు అందుబాటులో ఉండకుండా తమ వ్యాపారాల్లో మునిగి తేలిన వారు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఓట్ల కోసం నాయకులు ఇచ్చే డబ్బులు మహా అయితే ఒకటి రెండు రోజులు ఉంటాయి. కానీ ఐదేళ్ల వరకు పనిచేయని ప్రజాప్రతినిధిని ఎదురించేందుకు ఎన్నికల పుడు తీసుకున్న డబ్బు అడ్డొస్తుంది. అందుకే ఎన్నికల్లో నోటుకు ఓటు వేయవద్దని సంస్థలు, యువకులు ఇప్పుడు జోరుగా ప్రచారం చేస్తున్నారు. సోషల్‌మీడియాలో సైతం ఓటుకు నోటుపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

గెలిపించే శక్తి యువతదే..

అభ్యర్థులు యువతను మచ్చికచేసుకోవాలని చూస్తారు. ఇందుకు క్రికెట్ కిట్లను ఎరగా వేస్తారు. ఉదాహరణకు15మంది సభ్యులు ఉన్న యువజన సంఘానికి రూ.5 వేల విలువ చేసే కిట్ కొనిచ్చారనుకుంటే ఒక్కోవ్యక్తి మీద వారు చేసే ఖర్చు రూ. 333 అన్నమాట. అందు కోసం వారి దగ్గర చేతులుచాపాలి. దేశ భవిష్యత్తుకు వెన్నుముక వంటి యువత కిట్లకు ఓట్లు వేస్తే.. ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించండి. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో యువజన సంఘాలకు క్రికెట్ కిట్లు, స్థానిక టోర్నీల నిర్వహణకు డబ్బులు పంపకాలు జరిగాయి.

- జిల్లాలో 18 నుంచి 29 మధ్య వయస్సులైన యువకులు(ఓటర్లు) 5,36,563 మంది ఉన్నారు.
- 18 నుంచి 29 మధ్య వయస్సులైన యువతులు(ఓటర్లు) 5,55,072 మంది ఉన్నారు.
- ఈ వయస్సు వారిలో 99 శాతం మంది అక్షరాస్యులే ఉంటారు. ఏ నాయకునైనా గెలిపించే నిర్ణయాత్మక శక్తి వీరికే ఉంటుంది.

యువతకేం కావాలి..

జిల్లాలో పది లక్షలకుపైగా యువత ఉంది. వారికి మంచి నాణ్యమైన విద్య నందించాలి. వారిలో నైపుణ్యత పెంపొందించి.. భవిష్యత్‌కు బాటలు వేసేక నేందుకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఓట్లు అడిగే నాయకుల నుంచి మనకు క్రికెట్ కిట్లు వద్దు.. గెలిస్తే యువతకు మీరేం చేస్తారని కచ్చితంగా అడగాలి. వారి నుంచి గెలవకముందు ఎటువంటి ప్రతిఫలాన్ని పొందకుంటే గెలిచిన తర్వాత వారిచ్చిన మాటపై నిలబడకుంటే నిలదీసే దమ్ము యువశక్తికి ఉంటుంది.

పండుటాకులను పట్టించుకోవాలి..

జిల్లాలో 80 ఏళ్ల వయస్సు పైబడ్డ ఓటర్లు 32వేల మంది, 60 సంవత్సరాల పైబడ్డ ఓటర్లు 2.1లక్షల మంది ఉన్నారు. వివిధ కారణాలతో పింఛన్లు అందని వారు చాలామంది ఉన్నారు. వీరిలో కుమారుల నిరాదరణకు గురవుతున్న వారూఉన్నారు. అవ్వా.. దండం.. తాతా.. రాంరాం.. అంటూ మూలన ఉన్న ముసలోల్లను సైతం పలకరిస్తుంటారు. కానీ ఎన్నికలయ్యాక వారి సంగతే మరిచి పోతుంటారు. వృద్ధులకోసం నియోజకవర్గానికి ఒక వృద్ధాశ్రమం కావాలని ఆ పండుటాకుల తరుపున యువకులు,మహిళలు వకల్తా పుచ్చుకోవాలి. దీంతోపాటు నాయకుల నుంచి ఈ విషయంలో స్పష్టమైన హామీపొందాలి. ఎందుకంటే వారు జీవితంలో అలిసిపోయి ఉంటారు. రంగులు మార్చే రాజకీయ ఎత్తు గడలు వారికి తెలియవు. నిలదీసి అడగలేరు. జిల్లాలో 80 ఏళ్లకు వయస్సు పైబడ్డ 32వేల మంది ఓటర్లలో చాలా మంది మంచాన పడి పింఛన్ అందుకునేందుకు సుదూరం వెళ్లలేరు. ఇచ్చే అరకొర పింఛన్ చాలక ఆందోళన చెందుతుంటారు. అటువంటి వారికోసం ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందించే వారినే ఆదరించాలి. ఒకటో తేదీకి ఠంచన్‌గా అందరికంటే ఎక్కువగా రూ.4వేలు పింఛను అందించే నాయకులనే ఎన్నుకోవాలి. నాయకుడనే వారు ఇంతలోతుగా కూడా ఆలోచించే వారుండాలి. ఇలాంటి వారి కోసం ఆలోచించే వ్యక్తిని పట్టం కట్టాలి.

కుల సంఘాలు ఆలోచించాలి..

గెలుపు కోసం అభ్యర్థులు కులసంఘాలపైనా ప్రేమ ఒలకబోస్తున్నారు. సంఘాలకు పాత్రలు కొనివ్వడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఊరిలో కనీసం పది కులసంఘాలైనా ఉంటాయి. దాదాపు రూ.50 వేల వరకు ఒక్కో సంఘానికి ఆశచూపిస్తారు. కులసంఘం అన్నాక కనీసం వందమంది అయినా ఉంటారు. వారిచ్చే వంట పాత్రలకు పెట్టే డబ్బును లెక్కిస్తే తలా రూ. 100 కూడా రాదు. దాని కోసం రేపు గెలిచాక తమ సంఘానికి ఒక భవనం నిర్మించి ఇవ్వాలని అడగాలంటే ధైర్యం చాలదు. లోలోపల అప్పటి వంటపాత్రలు గుర్తొస్తాయి. అదే డబ్బులు తీసుకోకుండా మంచి నాయకునికి నిజాయితీగా ఓటు వేస్తే మాకు ఇది కావాలి అని దర్జాగా అడగొచ్చు. సంఘాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఆదరణ పథకంతో ఆదుకున్న వారిని ఒక క్షణం దృష్టి సారించాలి ఐదేళ్లుగా ఒక్క సామాజిక భవనానికి నోచు కోని ప్రభుత్వాలు కన్నా.. రానున్న కాలంలో ఇచ్చే హామీలకన్నా.. ఉన్న సమయంలోనే చేతిపనివృత్తులను ఆదుకున్న వారిని ఎన్నికల్లో ఆదరించాలి.

చీర, సారెలెందుకు..

జిల్లాలో మహిళా ఓటర్లు 9,45,130 మంది ఉన్నారు. ఓట్లు వచ్చాయంటే మహిళా ఓట ర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులు వేస్తారు. మహిళా సంఘాలను కలుస్తారు. చీరలు పంచిపెడతారు. వారిచ్చే చీరలు చాలా చౌకగా ఉంటాయి. ఒకటి రెండు సార్లు ఉతికితే చిల్లులు పడేవే అధికం. సంఘాలకు చేయూత పేరుతో కొందరికే తాయిలాలు ఇచ్చే పార్టీల కన్నా.. మహిళలందరికీ ఆదుకుంటామన్న పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

మహిళలు ఏమడగాలి..

జిల్లా ఓటర్లలో సగం భాగం మహిళలే ఉన్నారు. అభ్యర్థుల తలరాతలను తారుమారు చేసే శక్తి ఆడవారి చేతిలో ఉంది. ఈ ఎన్నికల్లో ఓటుకోసం వచ్చే నాయకులకు గతంలో మహిళ లందరికీ ఇచ్చిన పసుపు-కుంకుమ పథకాన్ని, నెలకు రూ.1500 ఇచ్చే మహిళశక్తి పథకాలను గుర్తుచేయాలి. దీనికంటే మెరుగైన పథకాలు ఉంటే చెప్పాలని కోరాలి. దీంతోపాటు లక్ష మంది జీడిపరిశ్రమల కార్మికులు ఉన్నారు.వారికి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రత్యేకంగా వారి కోసం ఆసుపత్రి కూడా లేదు. జిల్లాలో కేవలం ఒకే ఒక మహిళా పోలీసుస్టేషన్ ఉంది. మహిళల మీద అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమస్యలను పరిష్కరించే నాయకులకు ఆదరించాలి

నోటుకూ.. ఓ లెక్కుంది..

అభ్యర్థి ఓటుకు రూ.5వేలు ఇచ్చాడనుకుంటే గెలిచాక ఐదేళ్లు పాటు పదవిలో ఉంటారు. అంటే 1825 రోజులు. రూ.5వేలను 1825 రోజులకు లెక్క కడితే రోజుకు 270 పైసలు వస్తుంది.

పల్లె నుంచి పార్లమెంట్‌కు

- శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికైన వారంతా గ్రామీణులే..


(టెక్కలి)

శ్రీకాకుళం పేరుచెబితే గుర్తొచ్చేది వెనుకబడిన ప్రాంతమని. ఇక్కడ ఎక్కువగా పల్లెల్లోనే నివసిస్తుంటారు. ఇక్కడ నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన వారంతా పల్లెవాసులే. ఆరు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన బొడ్డేపల్లి రాజగోపాలరావు ఆమదాలవలస మండలం అక్కులపేటలో జన్మించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన గౌతు లచ్చన్నది సోంపేట మండలం బారువ. వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి గ్రామానికి చెందిన హనుమంతు అప్పయ్యదొర, నందిగాం మండలంలోని హరిదాసుపురానికి చెందిన డాక్టర్ కణితి విశ్వనాథం, కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన కింజరాపు ఎర్రన్నాయుడు, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టెక్కలి మండలం పోలవరానికి చెందిన డాక్టర్ కిల్లి కృపారాణి గ్రామీణ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం. రాష్ట్రంలో ఎక్కువ గ్రామీణ ప్రాంతం గల జిల్లా కూడా శ్రీకాకుళమే.



ప్రజలకు ఎలా ఓట్లు అడగాలి?

- పనులు చేసినా.. పరపతి పోయింది
- ఆందోళన చెందుతున్న సర్పంచ్‌లు



(నరసన్నపేట)

వైసీపీ ప్రభుత్వ హయాంలో వందలాది మంది సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారు. వేలాది రూపాయలు అప్పుచేసి పనులు చేసినా తమ పరపతిపోయిందని వాపోతున్నారు. సర్పంచ్‌గా గెలిచి ఊరికి రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేస్తామని చెప్పి చివరకు నిధులు రాక సొంత ఆస్తులు, వ్యవసాయ భూములు అమ్ముకుని పైసా లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో ప్రజల్లోకి ఎలా వెళ్లి ఓట్లు అడగాలని మదనపడుతున్నారు. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం ఎలాగైనా ఈసారికి గెలిపించాలని సర్పంచ్‌లు కాళ్లు పట్టుకుంటున్నారు. జిల్లాలో పలు మండలాల్లోని కొందరు సర్పంచ్‌లు తమ వ్యవసాయ భూములను తాకట్టు పెట్టగా, మరి కొందరు నాయకులు రూ.లక్షల్లో అప్పులుచేసి పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు రాక తీవ్రంగా ఇబ్బందిపడుతూ పరపతి తెచ్చినచోట పరువు పోతోందని వడ్డీలు కడుతున్నారు. కొందరైతే బంగారు నగలు విక్రయించి అప్పులుతీర్చారు. ఐదేళ్లుగా నాయకత్వం వహించే వారు సర్పంచ్‌లను పట్టించుకోవడంలేదు. మూడేళ్ల కిందట సర్పంచ్‌గా పోటీచేయి నీకు అండగా ఉంటామని చెప్పిన నాయకులు.. తీరా లక్షలు ఖర్చు అయ్యాక.. కనిపించడం లేదుకదా.. జరిగే పనులకు బిల్లులు వస్తాయని.. డాంబికాలు పలికారు. ఇది గమనించన కొందరు సర్పంచ్‌లు చాపకింద నీరులా కూటమి అభ్యర్థులకు బలం చేకూరుస్తున్నారు.

నదుల అనుసంధానమే..

నా ప్రధాన లక్ష్యం

- నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తాను
- వైసీపీ సర్కారు చేసిందేమీ లేదు
- అక్రమార్జనపైనే స్పీకర్ కుటుంబం దృష్టి
- ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్



(ఆమదాలవలస)

ఆమదాలవలస నియోజకవర్గ రైతాంగానికి ఎంతో అవసరమైన వంశధార, నాగావళి నదుల అనుసంధానమే తన ప్రధాన లక్ష్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కూన రవికుమార్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, స్పీకర్ తమ్మినేని కుటుంబం అక్రమార్జనపైనే దృష్టిపెట్టిందని ఆరోపించారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' సోమవారం ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు రవికుమార్ సమాధానాలు చెప్పారు.

ప్రశ్న: ఈ ఎన్నికల్లో మీరు గెలిస్తే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తారు?

జవాబు: 2014 ఎన్నికల్లో నేను శాసన సభ్యునిగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. 2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చూపింది. అర్ధాంతరంగా ఎన్నో పనులు ఉండిపోయాయి. ఈ ఎన్నికల్లో నేను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే అత్యవసరమైన పనులన్నీ పూర్తి చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తాను.

ప్ర: విజయంపై మీకున్న నమ్మకమేంటి?

జ: గ్రామస్థాయి నుంచి పలు పదవులు చేపట్టి ఈ స్థాయికి వచ్చాను. ప్రజాసేవే కర్తవ్యంగా పనిచేస్తానని, నీతి నిజాయితీతో కూడిన రాజకీయ నాయకుడిననే గుర్తింపు నాకు ఉంది. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు దాన్ని గుర్తించి నాకు ఓటు వేస్తారనే నమ్మకం ఉంది. నాపై పోటీ చేస్తున్న అధికార పార్టీ అభ్యర్థి తమ్మినేని సీతారాం శాసనసభాపతి పదవిలో ఉన్నా నియోజకవర్గాన్ని ఎటువంటి అభివృద్ధి చేయ కుండా వదిలేశారు. స్పీకర్, ఆయన కుటుంబ సభ్యులు అక్రమ సంపాదనపైనే దృష్టిపెట్టారు. నా పనితీరే నా విజ యానికి దోహదపడుతుందనే నమ్మకం ఉంది.

ప్ర: నియోజకవర్గంలో సాగునీటి సమస్యను పరిష్కరిస్తారా?

జ: పొందూరు మండలంలోని రెల్లిగెడ్డ, ఆమదాలవలస మండలంలోని కొత్తగెడ్డ, బూర్జ మండలంలోని ఓనిగెడ్డను నేను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేశాను. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఐదేళ్లలో రైతులకు అవసరమైన సాగునీటి కోసం రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ముఖ్యంగా జిల్లాలో 60 వేల ఎకరాలకు సాగునీటిని అందించే వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులను టీడీపీ హయాంలో 70 శాతం పూర్తి చేశాం. మిగిలిన పనులను పూర్తి చేయడంలో వైసీపీ సర్కారు విఫలమైంది. ఈ ఎన్నికల్లో గెలిచిన వెంటనే నదుల అనుసంధాన పనులు పూర్తి చేయడమే నా ప్రధాన కర్తవ్యం.

ప్ర: వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదంటారా?

జ: అవును. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఎంతో ప్రధానమైన ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారి విస్తరణ పనులను పూర్తి చేయలేకపోయింది. ఆమదాలవలస నియోజకవర్గ శాసనసభ్యుడే సభాపతిగా ఉన్నప్పటికీ ఈ రోడ్డు పనులను పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రహదారి విస్తరణకు రూ.40 కోట్లు మంజూరు చేశాం. అయినప్పటికీ ఐదేళ్లలో పనులను పూర్తి చేయలేకపోయారు. ఈ గుంతల రహదారిపై ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. రహదారులే పూర్తి చేసుకోలేని ఈ ప్రభుత్వం మిగిలిన అభివృద్ధి ఎలా చేస్తుంది.?

ప్ర: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై మీ అభిప్రాయం?


జ: రాష్ట్ర ప్రజల ఆస్తులను సైకో సీఎం జగన్ బలవంతంగా లాక్కొనేందుకే ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకు చ్చారు. దీన్ని ప్రతి ఒక్క ఆంధ్రుడు ఎదురించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై ఇప్పటికే టీడీపీ, జన సేన, బీజేపీ నాయకులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: ఈ ఎన్నికల్లో కూటమి ఎన్ని సీట్లు గెలుస్తుంది

జ: కేంద్ర, రాష్ట్రంలో జరిగిన అన్ని సర్వేలు కూడా కూటమికి అధికారమని చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ పతనం తప్పదని తేల్చాయి. చంద్రబాబుపై ప్రజల్లో ఎంతో నమ్మకం ఉంది. ఈ ఎన్నికల్లో ప్రజాతీర్పు తప్పకుండా మాకు అనుకూలంగా ఉంటుంది. 160 అసెంబ్లీ సీట్లలో విజయం సాధించి తిరుగులేని ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం.

రైతు ఉద్యమ రథసారథి లచ్చన్న

- ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం
- టంగుటూరు ప్రకాశం పంతులు మంత్రివర్గంలో చోటు
- ఇదీ స్వాతంత్ర్య సమరయోధుడి ప్రస్థానం



(పలాస)

స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్ర రైతు ఉద్యమ రథసారథిగా, బడుగు, బలహీనవర్గాల నాయకుడిగా సర్దార్ గౌతు లచ్చన్న కీర్తి పొందారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటీషు వారితో పోరాడారు. బడుగుల కోసం రాజకీయ నేతగా ప్రభుత్వాలతో పోరాడారు. రైతుల కోసం దేశంలో మొదటి సారిగా ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకూ పాదయాత్ర చేశారు. సోంపేట మండలం బారువకు చెందిన నిరుపేద గీతకార్మిక కుటుంబం గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు 1909 ఆగస్టు 16న గౌతు లచ్చన్న జన్మించారు. దేశవిముక్తి కోసం లచ్చన్న జైలుపాలయ్యారు. 1930లో మహాత్మాగాంధీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యారు. స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర వహించి సర్దార్‌గా మారారు. 1938 నవంబరు 7న ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకు ఆంధ్ర రాష్ట్ర రైతాంగ రక్షణ మహాయాత్ర నిర్వహించి చరిత్రపుటల్లోకి ఎక్కారు. అదే సంవత్సరం పలాసలో కిసాన్‌మహాసభలు నిర్వహించి దేశం నలుమూలల నుంచి పలువురు నాయకులను ఆహ్వానించిన ఘనత ఆయనకే దక్కింది. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం తర్వాత భాషాప్రయుక్త రాష్ట్రాల పార్లమెంట్ ఏర్పాటుచేసింది. ఈ కమిషన్‌సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం 1956లో ఫిబ్రవరి 20న పెద్దమనుషుల ఒప్పందాన్ని చేసింది. ఇందులో బూర్గుల రామకృష్ణారావు, కేవీ రంగారెడ్డి, ఎం.చెన్నారెడ్డి, జీవీ నర్సింగరావుతో కూడిన కమిటీలో లచ్చన్న కూడా ఒకరు ఉండడం విశేషం.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా..

1952లో జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో గౌతు లచ్చన్న కృషికర్‌లోక్‌పార్టీ తరపున పోటీ చేసి అసెంబ్లీ మెట్లు ఎక్కారు. 1953 నవంబరు 7న టంగుటూరు ప్రకాశం పంతులు మంత్రివర్గంలో లచ్చన్న చేరారు. ఏ రాజకీయ నాయకుడికి దక్కని గౌరవాన్ని దక్కించుకున్నారు. అనంతరం 1955, 1962, 1967, 1978 ఎన్నికల్లో గెలుపొందారు. తర్వాత ఆయన కుమారుడు గౌతు శ్యామసుందరశివాజీ వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో గౌతు లచ్చన్న మనుమరాలు (శివాజీ కుమార్తె) గౌతు శిరీష టీడీపీ తరుపున ఎన్నికల బరిలో దిగారు. ఆయన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల కోసమే అంకితం కావడం విశేషం. సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

ప్యాకేజీ వీరులు.. ఓట్లు లేని స్టార్లు

హరిపురం: ఎన్నికలు వచ్చేయంటే చాలు. ప్యాకేజీ వీరుల సందడి అలా ఇలా ఉండదు. తమ చేతిలో వందలాది ఓట్లు ఉన్నాయని, తాము ఏ పార్టీకి చెబితే వారంతా ఆ పార్టీకే ఓట్లు వేస్తారని చెప్పి కొంతమంది చోటా మోటా నేతలు అభ్యర్థుల వద్ద నుంచి రూ.లక్షల్లో ప్యాకేజీలు తీసుకోవడం ఎన్నికల్లో పరిపాటిగా మారింది. వీరి ధాటికి గ్రామాల్లో కొద్దోగొప్పో ఓట్లు ఉన్న నేతలు జీరోలుగా మారిపోతున్నారు. ఓట్లులేని ప్యాకేజీ వీరులు మాత్రం తమ మాటలతో అహోఓహో అంటూ ప్రచారం ఆర్భాటంగా చేస్తు న్నారు. ఇటువంటి వారికి ప్యాకేజీలు ఇవ్వకపోతే అభ్యర్థులు, పార్టీపై నెగిటివ్‌గా ప్రచారం చేస్తున్నారు. అంతేకాక వీరు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. మరికొందరైతే ప్యాకేజీల కోసం పార్టీ మారుతారని ప్రచారం చేసుకుంటున్నారు. ప్యాకేజీ ఈ ప్రచారం ఆ నోటా ఈ నోటా పడి మండలస్థాయి నాయకుల ద్వారా అభ్యర్థుల దృష్టికి వెళ్తోంది. దీంతో తమ గెలుపునకు ఎక్కడ ఇబ్బంది జరుగుతుందోనని భయంతో అభ్యర్థులు వారిని పిలిపించి బుజ్జగించి ప్యాకేజీలు ఇస్తున్నారు. కాగా ఓటర్లులేని నాయకులకు ప్యాకేజీలు ఇవ్వడంతో అవతల పార్టీ వారు ఎక్కడ విజయం సాధిస్తారోనని పలువురు గుసగుసలాడుతున్నారు. కాగా ఇది ఇరుపార్టీల్లో ఉండగా.. అధికార పార్టీలో అధికంగా నెలకొంది.



నువ్వటు... నేనిటు

- వేర్వేరు పార్టీల్లో కుటుంబసభ్యులు
- అంతర్గతంగా ఫోన్ సంభాషణలు



(నరసన్నపేట)

ఎన్నికల సమయంలో పలువురు తండ్రీకుమారులు, అన్నదమ్ములు, బావబామర్దులు వ్యూహాత్మకంగా వేర్వేరు పార్టీల్లో ఉంటూ పబ్బం గడుపుతున్నారు. వారు ముమ్మరంగా ప్రచారాల్లోనూ పాల్గొంటున్నారు. ఇటువంటి వారు ఉదయం, సాయంత్రం ఎప్పుడు వీలైతే అప్పుడు ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తాము చేసే అక్రమాలు, అవినీతికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు ఆయా వ్యక్తులు తమ సన్నిహితులు వద్ద చెబుతుండడం గమనార్హం. ఈ తతంగాన్ని గమనిస్తున్న కొందరు ఇటు వంటి వారు డబుల్‌గేమ్ ఆడుతున్నారని చెబుతున్నారు. అంతేకాక వారు ఆయా అభ్యర్థులతో సన్నిహితంగా మెలుగుతూ తమ ప్రాధాన్యతను పెంచుకుంటున్నారు. టీడీపీ, వైసీపీల తరఫున అభ్యర్థుల వద్ద అన్నదమ్ములు, వారి బంధుగణం వ్యవహరించే తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



జన కేతనం
ఆంధ్రజ్యోతి
మంగళవారం 7 మే 2024

ఆ ఫోన్ ఆపండిరోయ్..!

మెళియాపుట్టి: ఎన్నికల నామినేషన్లు పూర్తయిన తర్వాత విపరీత ప్రచారం చికాకు తెప్పిస్తోంది. సమయం తక్కువగా ఉండడంతో ప్రచార వివరాలు, మేనిఫెస్టో వివరాలను అభ్యర్థులు ఫోన్ కాల్స్ రికార్డుచేసి వాయిస్‌తో పంపిస్తున్నారు. ఒకరోజులో పది వరకు ఫోన్ కాల్స్ వరకు వస్తుండడంతో విసిగిపోతున్నారు. దీనికి తోడు వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికల సమాచారంతో ఊదరగొడుతుండడంతో కొందరు సెల్‌పోన్ అంటే భయపడిపోతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువగా ప్రచారం జరుగుతుం దన్న ఉద్దేశంతో అభ్యర్థులు కాల్ రికార్డుచేసి విసిగెత్తిస్తున్నారు.

పేరుకే పోటీ.. ప్రభావం అంతంతే

- నామమాత్రంగా మారిన స్వతంత్రులు
- వారికంటే నోటాకే ఎక్కువ ఓట్లు
- ప్రస్తుత ఎన్నికల బరిలో 40 మంది

(మెళియాపుట్టి)

దేశానికి స్వాతంత్రం వచ్చిన తొలిరోజుల్లో చట్టసభల్లో ఎక్కువ మంది స్వతంత్రులు ఉండేవారు. అప్పట్లో ఎన్నికల వ్యయం తక్కువగా ఉండడం, ఆదర్శభావాలు ఉండేవారిని, సమాజంలో పలుకుబడి ఉండేవారిని, మేదావులను ప్రజలు గెలిపించేవారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో రానురాను స్వతంత్రులు పాత్ర తగ్గిపోతోంది. రాష్ట్రంలో 1999 తర్వాత స్వతంత్ర అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందలేదు. ఎన్నికల్లో ఖర్చు కోట్లకు చేరడం, ప్రజలు పార్టీలకే ప్రాధాన్యం ఇవ్వడం వెరసి స్వతంత్రుల గెలుపు కష్టతరంగా మారింది.



సరదా కోసం..

సాధారణంగా ఎన్నికల్లో పోటీచేయాలని సగటు పౌరుడు భావిస్తాడు. సరదాకోసం కొందరు నామినేషన్ దాఖలు చేస్తున్నారు. మరికొందరు పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వకపోతే అదే ఉండే తన ప్రత్యర్థిని ఓడించాలన్న కసితో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. కొందరికి ఆర్థిక, అంగబలం లేకపోయినా స్థానికంగా ఏమాత్రం గుర్తింపు ఉండకపోయినా బ్యాలెట్ పేపర్‌పై తమ పేరు, ఫొటో ఉంటే చాలన్న ఉద్దేశంతో పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

డిపాజిట్లు కూడా రావట్లే..

ఒక్కో నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు రెండు,మూడో ఉంటే పోటీలో మాత్రం మొత్తం పదిమంది వరకూ ఉంటున్నారు. 2003 వరకు ధరవత్తు తక్కువగా ఉండేది. దీంతో ఎక్కువ మంది పోటీకి ముందుకు వచ్చేవారు. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా స్వతంత్రులు పోటీలో తక్కువ మంది ఉండేందుకు డిపాజిట్ పెంచడంతోపాటు అఫిడవిట్ సమర్పించడం వంటి మార్పులు తీసుకువచ్చారు. ఒక్కసారి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీలకు ఐదు వేలు, బీసీ, ఇతర అభ్యర్థులకు రూ. పదివేలుకు పెంచారు.దీంతో నిరుద్యో గులు, అట్టడుగువర్గాలు పోటీకి కొంతవరకు దూరమయ్యాయి. స్వతంత్రులు పోటీలో ఉంటున్నా, ప్రస్తుతం మద్యం, డబ్బుప్రభావంతో డిపాజిట్‌కు నిర్ధారించిన ఓట్లను తెచ్చుకోలేకపోతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మాత్రమే గట్టి పోటీ ఇవ్వగలుగుతున్నారు. ఎన్నికల సంస్కరణలో భాగంగా 2014 తర్వాత నోటాను ఈవీఎంల్లో ప్రవేశపెట్టారు. కొందరు తటస్థ, విద్యావంతులు ఎవరికి ఇష్టం లేకపోతే నోటాకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో నోటాకు వచ్చిన ఓట్లు సైతం స్వతంత్రులకు రావడం లేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానన్నా ప్రధాన పార్టీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒక వేల పార్టీ టికెట్ ఇవ్వకపోయినా ఒకటి రెండు రోజులు అసంతృప్తిగా ఉన్నా తర్వాత సర్దుబాటు చేసుకుని ముందుకు సాగుతున్నారు.

ప్రస్తుత ఎన్నికల్లో..

జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నిక 73 మంది పోటీల్లో ఉన్నారు. ఇందులో అధికంగా 40 స్వతంత్రులు కాగా మిగిలిన తొమ్మిది మంది బీఎస్పీ, జైభారత్‌నేషనల్ పార్టీ, గోండ్వాన దండకారణ్య తదితర పార్టీల నుంచి బరిలో ఉన్నారు. ఇంకా పోలింగ్‌కు వారంరోజులు మాత్రమే గడువు ఉంది. ప్రధాన పార్టీలు శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో గల అసెంబ్లీ సెగ్మెంట్లల్లో ప్రచారం ఉధృతం చేశాయి. ఉష్ణోగతలు 45 డిగ్రీల దాటి నమోదవుతున్నా లెక్క చేయకుండా ప్రజల్లో తిరుగుతున్నారు. అయితే స్వతంత్ర అభ్యర్థులు ఇళ్ల నుంచే బయటకు రావడంలేదు. ఎక్కడా వారి ప్రచారం కనిపించడంలేదు. మేని ఫెస్టోలను సైతం ప్రకటించలేదు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో వారి ప్రభావం ఉందని ప్రధానపార్టీల నాయకులు చెబుతున్నారు. ఎలాగైనా తాము గెలిచే పరిస్థితి లేదు, ఎండలో ఎందుకు తిరగాలని భావించి స్వతంత్ర అభ్యర్థులు ప్రచారానికి సైతం ప్రాధాన్యం ఇవ్వడంలేదు. ఆమదాలవలస నియోజకవర్గంలో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థులు మాత్రం ప్రధాన పార్టీలు నాయకులతో పోటీపడి ప్రచారం సాగిస్తున్నారు.

గత ఎన్నికల్లో

జిల్లాలో 2019లో జరిగిన ఎన్నికల్లో 35మంది స్వతంత్రులు పోటీచేయగా ఏ ఒక్కరికి డిపాజిట్ రాలేదు. గతసారి జరిగిన ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గంలో నోటాకు 4,217 ఓట్లు రాగా ఒక స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన వ్యక్తికి 150 ఓట్లు మాత్రమే రావడం విశేషం. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తే ప్రధాన పార్టీల నాయకులు బేరసారాలకు వచ్చి కొంతమేర డబ్బులు ముట్టజెబుతారని భావించి కొందరు బరిలో దిగుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్ల శైలి మారిపోయింది. డబ్బులు, మద్యానికే ప్రాధా న్యం ఇస్తున్నారు. కొందరు ఓటర్లు నేరు అభ్యర్థికే డబ్బులు విషయంపై అడుగుతున్నారు. ఈనేపథ్యంలో కొందరు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు.

ఎత్తుకు.. పైఎత్తులు

- బుజ్జగింపులు.. ప్రలోభాలకు తెరతీసిన అభ్యర్థులు
- పోలింగ్ తేదీ దగ్గర పడడంతో ఓటర్లకు వల
- గెలుపే లక్ష్యంగా అన్నిరకాల ప్రయత్నాలు



(నరసన్నపేట/ఇచ్ఛాపురం/సోంపేట)

పోలింగ్‌కు మరో ఆరు రోజులే సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రచార శైలిని మార్చారు. సర్వశక్తుల ఒడ్డి పోరాడు తున్నారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా ఓటర్లను ఆకట్టుకోవడానికి పోటీ పడుతున్నారు. గ్రామస్థాయిలో పలుకుబడి ఉన్న నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. పగలంతా ప్రచారంచేసి, రాత్రి చోటామోటా నాయకులను బుజ్జగించి పార్టీలో చేర్చుకుంటున్నారు. వారిని దారిలోకి తీసుకురావడానికి ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. మాట వినని వారికి కొందరు తెలిసిన వారితో చెప్పిస్తున్నారు. అలవి కాని హామీలు కూడా ఇస్తున్నారు. ఓటర్లను కేవలం డబ్బులతో ప్రలోభ పెట్టవచ్చని నాయకులు ఒక అంచనాకు వచ్చారు. అందుకే కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. అలాగే, మద్యం ఏరులై పారుతోంది. సారా నుంచి బ్రాందీ వరకు ఎన్నేరూపాల్లో మద్యం ఓటర్లకు చేరుతోంది. అన్నిపార్టీల నుంచి ఫిరాయింపులు మొదలయ్యాయి. తమ నాయకులు మీద అసంతృప్తి, ఎదుటి పార్టీల ఆఫర్లు నచ్చి నాయకులు, వారి అనుచరులు పార్టీలు మారుతున్నారు.

వైసీపీ అభ్యర్థులు డీలా

టీడీపీ, వైసీపీ అభ్యర్థులు తమ మేనిఫెస్టోలను ప్రజలకు వివరిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉండడంతో అభ్యర్థులు ప్రచారంలో మరింత రెట్టి ఉత్సాహంతో దూసుకుపోతున్నారు. వైసీపీ అభ్యర్థులు మాత్రం డీలాపడుతున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో జరిగిన విధ్వంసంపైనే టీడీపీ నేతలు ప్రధానంగా ఫోకస్ పెట్టి ప్రచారాన్ని సాగిస్తున్నారు. మరో వైపు ట్రెండ్ కూటమి వైపు ఉందన్న సంకేతాలు ఉండడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. వారిని ఆపడానికి వైసీపీ నాయకులు తంటాలు పడుతున్నారు. మరో వైపు పగలు ప్రచారం చేసి, రాత్రివేళల్లో మంతనాలు, వార్డుల వారీగా సమీక్షలతో పార్టీ కార్యాలయాలు, నేతల ఇళ్లు జాతరను తలపిస్తున్నాయి. మొన్నటి వరకు పార్టీ అభ్యర్థులు మాత్రమే ప్రచారం చేసేవారు. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండడంతో కుటుంబ సభ్యులతో పాటు పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలు కూడా వార్డులు వారీగా ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎక్కువగా యువతను ఆకట్టుకునే అంశాలపై దృష్టి సారించారు. కూటమి మేనిఫెస్టోలో కీలకమైన ఏటా రూ.4లక్షల ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి, తదితర వాటిపై అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. అరకొరగా అమలు చేసిన సంక్షేమ పథకాలనే నమ్ముకుని వైసీపీ అభ్యర్థులు ఓటర్ల వద్దకు వెళ్తున్నారు.

ఎండను సైతం లెక్కచేయకుండా..

అభ్యర్థులు ప్రచారంలో అవస్థలు పడుతున్నారు. జిల్లాలో గత వారం రోజులుగా 45 డిగ్రీల వరకు ఉష్ణోగతలు నమోదవుతుండడంతో చెమటలు కక్కుతున్నారు. అభ్యర్థులు ఎండను సైతం లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్నారు. అయినా కొన్నిగ్రామాల ఓటర్లను కలిసుకోవడానికి సమయం సరిపోకపోవడంతో మదనపడుతున్నారు. ఎండ తీవ్రతకు కొందరు కార్యకర్తలు ప్రచారానికి ముందుకురావడంలేదు. వచ్చినా ఉదయం పదిగంటలలోపే తిరుగుపయనం అవుతున్నారు. సాయంత్రం నాలుగు గంటలు కానిది మళ్లీ ప్రచారానికి రావడంలేదు. ప్రచారానికి వస్తే రెండువిడతలుగా రూ.200 చొప్పున ఇవ్వాల్సి వస్తోందని లెక్కలేసుకుని అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. వీటికితోడు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడవుతుంది.

రూ.200 కోట్ల పైనే పంపకాలు

ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లకు నగదు పంపకాలు ప్రారంభమయ్యాయి. తటస్థ ఓటర్లకు తాయిలాలు ఇచ్చేందుకు అభ్యర్థులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆటు గ్రామాల నుంచి పట్టణాలు వరకు నోట్ల కట్టలు తెంచుకుంటున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల నుంచి పంచాయతీలకు నోట్ల కట్టలు చేరుకున్నట్లు సమాచారం. అట్ట బాక్సుల్లో మూడేసి పంచాయతీలకు కొందరు నాయకులు ప్యాకింగ్‌చేసి గ్రామ, వార్డుస్థాయి నాయకులకు చేరుస్తున్నా రు. ఒక్కోఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వరకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. తమ వారివి ఎన్ని ఓట్లు ఉన్నా, ఒక్క ఓటు కూడా పోకూడదని చెప్పి వారికి వెయ్యి చొప్పున అందిస్తున్నారు. ఇక తటస్థంగా ఉండే వారు ఎలాగైనా ఈసారి తమకే ఓటు వేసేలా వారికి ఒక్కో ఓటుకు రూ.2వేలు చొప్పున ఇవ్వాలని స్థానిక నేతలకు అభ్యర్థులు హుకుం జారీ చేసినట్లు సమాచారం. జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఆర్థికంగా బలవంతులైన ఇద్దరు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీపడి మరీ ఓటు విలువ పెంచుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆ ఒక్క నియోజవర్గంలోనే సుమారు రూ.30 కోట్లపైగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల్లో అక్కడున్న పరిస్థితుల మేరకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు పంపిణీచేసేందుకు రంగం సిద్ధం చేశారు. జిల్లాలో ఈ ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసేందుకు నాయకులు రూ.200 కోట్లకు పైగా పంపిణీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.



ప్రజా సంక్షేమమే ధ్యేయం



నందిగాం: ఆనందపురంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు



పోలాకి: ఉరజాంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు, బగ్గు రమణమూర్తి

- కూటమి అభ్యర్థుల ముమ్మర ప్రచారం

నందిగాం/పలాసరూరల్/కొత్తూరు/అరసవల్లి/పోలాకి/బూర్జ/కంచిలి, మే 6: ప్రజా సంక్షేమమే ధ్యేయమని కూటమి అభ్యర్థులు పేర్కొన్నారు. సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. నందిగాం మండలంలోని దేవుపురం, బడగాం, కొత్తగ్రహారం, పెద్దబాణాపురం, ఆనందపురం, హరిదాసుపురం, పీఏపురం తదితర పంచాయతీల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటువేసి తనను, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బడగాం మాజీసర్పంచ్ కూన వాసునాయుడుతో పాటు సుమారు 40 కుటుంబాలు, అలాగే సవరబడగాంకు చెందిన పలు కుటుంబాలు అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరాయి. పోలాకి మండలం ఉరజాంలో ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి ప్రచారం నిర్వహించారు. పలాస మండలం కిష్టుపురం గ్రామంలో కూటమి అభ్యర్థి గౌతు శిరీష, కొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు, బూర్జ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ విస్తృత ప్రచారం చేపట్టారు. శ్రీకాకుళం రిమ్స్‌లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ కార్మికులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కంచిలి మండలం తలతంపర పంచాయతీలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్ ప్రచారం నిర్వహించారు.



పలాస రూరల్: కిష్టుపురం గ్రామంలో ప్రచారం చేస్తున్న గౌతు శిరీష



బూర్జ: ప్రచారం చేస్తున్న కూన రవికుమార్



కంచిలి: తలతంపరలో ప్రచారం చేస్తున్న అశోక్



కొత్తూరులో ప్రచారం చేస్తున్న మామిడి గోవిందరావు



అరసవల్లి: రిమ్స్ కార్మికులతో మాట్లాడుతున్న గొండు శంకర్

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్



నరసన్నపేట: హెల్ప్‌డెస్క్ వద్ద ఓటర్లకు సూచనలు ఇస్తున్న దృశ్యం, ఓటు వినియోగించుకున్న ఉద్యోగి

నరసన్నపేట/పలాస/పాతపట్నం/టెక్కలి, మే 6: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రశాంతగా జరిగింది. మూడో రోజు సోమవారం పోలీసులు, హోంగార్డులు, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నరసన్నపేట జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో గత రెండు రోజులుగా నెలకొన్న గందరగోళ పరిస్థితులను కలెక్టర్ ఆదేశాలతో ఆర్వో రామ్మోహన్‌రావు చక్కదిద్దారు. ఒకే పోలింగ్ కేంద్రంలో ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా తగిన ఏర్పాట్లు చేశారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యఆరోగ్య సిబ్బందిని నియమించారు. నరసన్నపేట నియోజవర్గంలో సోమవారం నాటికి 2,560 మంది వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఈసీ ఆదేశాల మేరకు ఈనెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అవకాశం ఉంది. ● పలాసలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగిసింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 112 మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి ఎం.సురేష్ తెలిపారు. బ్యాలెట్‌బాక్స్‌లను అభ్యర్థుల సమక్షంలో సీల్ వేసి స్ట్రాంగ్ రూములకు తరలించారు. మొదటి రోజు 756, రెండోరోజు 934, మూడో రోజు 112 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ● పాతపట్నం నియోజకవర్గ పరిధిలో సోమవారం 152 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు ఈఆర్వో ఎం.అప్పారావు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 2,976 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకుగానూ 2,223 పోలైనట్లు చెప్పారు. అలాగే హోం ఓటింగ్‌లో 24 ఓట్లు పోలైనన్లు తెలిపారు. ● టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ పరిదిలో సోమవారం 214మంది పోస్టల్‌బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు ఆర్వో నూరుల్ కమర్ తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేసి స్ట్రాంగ్ రూములకు తరలించారు.

మా ఓటు మాటేమిటి సార్?

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలపై ఎన్నికల సంఘం నిఘా వేసింది. అందుకు అధికారులూ ఉన్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లతో ఎన్నికల ప్రచార శైలిపై ఫొటోలు, వీడియోలు తీయిస్తున్నారు. ఎన్నికల అధికారుల వెంట ఉండే ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందా? నియోజకవర్గానికి సుమారు 70 మంది వీడియో గ్రాఫర్లను ఎన్నికల అధికారులు పనిలో ఉంచుకున్నారు. వారంతా ఓటు హక్కు వదులుకునే పరిస్థితి కనిపి స్తోంది. ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధం... ఓటు హక్కు తప్పని సరిగా వినియో గించుకోవాలని ఊదరగొట్టే అధికారులు తమ వెంట ఉండే సిబ్బంది, పనిలో ఉన్న వారందరితో ఓటు వేయిస్తారో.. లేదో..?

ఎన్నికలు అంటే అప్పట్లో సరదాగా ఉండేవి

(పోలాకి)



నేను 1923లో జన్మించాను. 102 సంవత్సరంలోకి అడుగుపెట్టాను. దీర్ఘాశి వీఆర్వో ఇంటికి వచ్చి హోంఓటింగ్ గురించి చెప్పారు. నేను పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటువేస్తానని తెలియజేశాను. అప్పట్లో వృద్ధులకు మంచాల మీద పడుకోబెట్టి ఓటింగ్ కేంద్రానికి తీసుకు వెళ్లేవారు. నేను 1947లో తొలిసారిగా ఓటు వేశాను. అప్పట్లో ఎన్నికలన్నా, ఎన్నికల విధులన్నా సరదాగా ఉండేది. నేను నా భార్య పి.గిరిజాదేవి కలిసి ఓటు వేసేందుకు వెళ్లేవాళ్లం. ఎటువంటి తాయిలాలు తీసుకునే వాళ్లంకాదు. సొంత వాహనంతోనే పోలింగ్ కేంద్రానికి వెళ్లేవాళ్లం. నేను నా కుటుంబ సభ్యులం ఓటు వేయడమే కాకుండా సమీప ఓటర్లకు పిలిపించి ఓటువేయించి ఓటు ప్రాధాన్యతను వివరించేవాళ్లం. అప్పటి రాజకీయాల్లో విలువలుండేవి. ఇప్పుడు లేవు. అప్పట్లో అవినీతికి ఆస్కారం ఉండేది లేదు. కరణం, నాయుడు చెప్పిన మాట ప్రజలకు వేదం. ఆ నమ్మకంతోనే గ్రామంలో భూముల క్రయవిక్రయాలు జరిపించేవాళ్లం. ప్రభుత్వ భూమిని నిరుపేదలకు అప్పగించేవాడ్ని. 40 సంవత్సరాల పాటు కరణం వృత్తి చేశాను. అప్పట్లో నెలకు రూ.30 జీతం ఇచ్చేవారు. ఆ తర్వాత కరణం, నాయుడు పద్ధతిని ప్రభుత్వం రద్దు చేసింది. పింఛన్ తొలుత రూ2వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం రూ. 4 వేలు వస్తోంది.

- పులుగుర్త కుమారస్వామి, శతాధిక వృద్ధుడు, మాజీ కరణం, దీర్ఘాశి, పోలాకి మండలం

జగన్ పాలనలో యువత భవిష్యత్ నాశనం: ఎంపీ



నైరలో ప్రచారం నిర్వహిస్తున్న ఉమ్మడి అభ్యర్థులు రామ్మోహన్ నాయుడు, శంకర్

శ్రీకాకుళం రూరల్: గడచిన ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని యువత భవిష్యత్ నాశనమైందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రూరల్ మండలం నైర పంచాయతీలో అరవల రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం ప్రజాగళం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను, ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాక, యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు కోల్పోయారన్నారు. డీఎస్సీ తీస్తామని ఐదేళ్లు మభ్య పెట్టారని విమర్శించారు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులు, స్పీకర్ తమ ఆస్తుల పెంచు కోవడంపై శ్రద్ధ చూపించారు కాని, యువత భవిష్యత్తుపై చూపించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో సంక్షేమం కొరవడి సంక్షోభం నెలకొందన్నారు. రాష్ట్రం లో మళ్లీ సాధా రణ పరిస్థితులు వచ్చి అభివృద్ధి, సంక్షేమం దిశలో పయనించాలంటే కూటమి ప్రభు త్వం రావాల్సి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించడం ద్వారా కూటమి ప్రభు త్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా గొండు శంకర్‌ను గెలిపించాలని కోరారు. శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థిగొండు శంకర్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస మీదుగా ప్రధాన మార్గంలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందన్నారు. ఇటు స్పీకర్, అటు మంత్రి ధర్మాన ప్రధాన రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యం వహించారన్నారు. కార్యక్రమంలో పలువురు ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాక్షస పాలనను తరిమికొట్టాలి: రవికుమార్

బూర్జ: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, దీనిని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఆమదాలవలస కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ కోరారు. మండలంలోని చలికాం, సుంకరిపేట, కాశపర్తి, గుత్తావల్లి, లాభాం, చిన్నలంకాం, పెద్దలంకాం, మామి డివలస, కాఖండ్యాం, నీలాదేవిపురం, వావాం, ఉప్పపేట, బూర్జలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైసీపీ కనుమరుగవుతుందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కూటమి నాయకులు రాంజీ, రమేష్, గోపి, అశోక్, రాంబాబు, కృష్ణ, సీతబాబు, ప్రభాకరరావు, జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: జగన్ చేతకానితనంతో రాష్ట్రం అతలాకుతలమైందని టీడీపీ మండల నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల డిల్లేశ్వరరావు అన్నారు. సోమవారం రామచంద్రాపురం, పొన్నాంపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా కూన రవికుమార్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొర్లె సూర్యం, నేతింటి జ్యోతి, తమ్మినేని అమర్నాథ్, బత్తుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

చంద్రబాబును సీఎం చేయండి: బగ్గు



మాకివలసలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: టీడీపీ అధినేత చంద్రబాబును సీఎంగా చేయాలని, ఈనెల 13న జరగ నున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణ మూర్తి కోరారు. సోమవారం మాకివలస, కిళ్లాం పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి వేతనదారులతో మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. నారా చంద్రబాబు నాయుడును సీఎంగా చేస్తే మహిళల అభ్యున్నతికి పాటుపడతారన్నారు. రైతులు సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాల న్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ యాళ్ల వేణు గోపాలరావు, బీఆర్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో ప్రజలకు మేలు: ఎంపీ

ఉరజాం(పోలాకి): టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తి ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఎంపీ నాయుడు, రాంబాబు, నర్సింగరావు, బైరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కేలవలస నుంచి 150 కుటుంబాలు చేరిక

జలుమూరు (సారవకోట): కేలవలస మాజీ ఎంపీటీసీ రావాడ చెంచయ్య, ఉప సర్పంచ్ చింతు లక్ష్మణరావుతో పాటు 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సోమవారం పద్మాపురంలో ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, సాధు కృష్ణారావు, శిమ్మ రామకృష్ణ పాల్గొన్నారు.

రిమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: గొండు శంకర్

అరసవల్లి: రిమ్స్ కాం ట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మి కుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. సోమవారం రిమ్స్ ఆసుపత్రికి ఓ పరామర్శకు వెళ్లిన ఆయన ను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో మీకు అండగా ఉంటానని, సకాలంలో వేతనాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఉద్యోగుల భవిష్యత్తుకే భద్రత కరువైందని, సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెపిలించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణరావు, రెడ్డి గిరిజా శంకర్, మూకళ్ల సింహాద్రినాయుడు, కేవీఎస్ నాయుడు, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో విస్తృత ప్రచారం



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని బలగ మెట్టు, ఆదివారంపేట ప్రాంతాల్లో సీనియర్ నాయకుడు రెడ్డి చిరంజీవులు, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, రెడ్డి శివన్నారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించా రు. కూటమికి ప్రజాదరణ లభిస్తుండడం వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టి నాగభూషణరావు, రెడ్డి గిరిజాశంకర్, ఆక్కిన రాజారావు, చిట్టి రాము, మజ్జి జగన్, బాన్న బద్రి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలో మత్స్యకారులు చేరిక

రణస్థలం: దోనిపేట గ్రామంలోని ఎం.అప్పలస్వామి, దోని నాగరాజు, ఎం.శ్రీను, ఎం.ఎర్రయ్య, దోని రాముడు, కల్యాణ్, లక్ష్మ తదితర వైసీపీకి చెందిన మత్స్యకార కుటుంబాలు సోమవారం ఎన్డీఏ కూటమిలో చేరాయి. వీరికి ఎచ్చెర్ల నియోజకవర్గం కూటమి అభ్యర్థి నడుకుదటి ఈశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా తనకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత పైడయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూటమిలో చేరిన వైసీపీ నేతలకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎన్ఈఆర్

ప్రజల భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట రమణ

అరసవల్లి: ప్రజల భూములను కాజేసేందుకే సీఎం జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. సోమవారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రంలోను ఈ యాక్ట్ అమలు చేయలేదని, మరి ఆ చట్టాన్ని అమలు చేసేం దుకు జగన్‌కు ఎందుకంత తొందర అని ప్రశ్నించారు. ఇది భూరక్ష చట్టం కాదు భూభక్ష చట్టమని విమర్శించారు. టీడీపీని గెలిపించి భూములపై హక్కులను కాపాడుకుందామని అన్నారు. ఒక్క జగన్ బినామీ కంపెనీకి రామాయపట్నం పరిసరాల్లో 8500 ఎకరాలను కారు చౌకగా భూమిని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపుదామన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుకల సాధికార సమితి డైరెక్టర్ కొమ్మనాపల్లి వెంకటరామరాజు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు గేర అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



కొండతెంబూరు సమీపంలో హైవేపై కూలిన చెట్లు



జలుమూరులో ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం

నందిగాం: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవించి మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం నుంచి ఎండతీవ్రతతో ఉక్కిరిబిక్కిరైనా సాయంత్రానికి ఊరట కలిగింది. ఈదురుగాలులు కారణంగా పలు చోట్ల చెట్లు నేల కూలడంతో పాటు పెట్రోల్‌బంక్ ఆవరణలో డిస్‌ప్లే బోర్డులు పడిపోయాయి. మామిడి, జీడి కాస్తో, కూస్తో వచ్చిన పంట గాలికి నేలరాలాయి.

అకాల వర్షం అన్నదాతకు కష్టం

జలుమూరు: అకాల వర్షాలతో అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలుల తో కూడిన వర్షం పడడంతో రైతులు అష్టకష్టాలు పడ్డారు. రబీలో వేసి వరి చేను పంటకొచ్చి నూర్పిడి సమయంలో వర్షం పడడంతో ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలంతా భానుడు భగభగలతో ఎండవేడిమి తగిలి సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులుతో కూడిన వర్షం పడడంతో చేతికందివచ్చే ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు ఇక్కట్లకు గురయ్యారు. కల్లాలు, రోడ్లు పక్కన ఉన్న ధాన్యం నిల్వలపై టార్పాలిన్లు కప్పారు. జలుమూరు, శ్రీముఖలింగం, అచ్యుతాపురం, నగిరికటకం, కొమనాపల్లి, పాగోడు, కోనసింహాద్రిపేట తదితర గ్రామాల్లో పండించిన రబీ వరి పంటను సంరక్షించుకునేందుకు రైతులు ఇబ్బందులకు గురయ్యారు.

హోమ్ ఓటింగ్ పరిశీలన



టెక్కలి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం టెక్కలి నియోజకవర్గ పరిధి లో 85 ఏళ్లు పైబడిన వారు, పూర్తిగా దివ్యాంగుల ఇంటి వద్దనే హోమ్ ఓటింగ్ తీసుకు న్నారు. 26మంది హోమ్ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనగా రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలిం చారు. టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొ మ్మాళి, నందిగాం మండలాల పరిధిలో ఉన్న హోమ్ ఓటర్లు రహస్యంగా ఓటు వేసుకునేలా చర్యలు చేపట్టారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగినట్టు ఆయన తెలిపారు.

హోం ఓటింగ్ ప్రారంభం



నరసన్నపేట: నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు, 85 ఏళ్ల దాటిన వృద్ధులు 117 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆర్వో రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో 29 బృందాలు వారి ఇళ్లకు వెళ్లి ఓటింగ్ చేయించారు. కార్యక్రమంలో పీవోలు, మైక్రో అబ్జర్వర్లు, ఏపీవోలు, పోలీసులు పాల్గొన్నారు.

78 మంది ఇంటి వద్దే ఓటింగ్

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు సోమవారం ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో లక్ష్మణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 53 మంది వయోవృద్ధులు, 25 మంది దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ న్యాయాధికారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట: మధ్యవర్తులుగా ఎంపానల్ అయ్యేందుకు రిటైర్డ్ న్యాయాధికారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అనుబంధంగా మీడియేటర్లుగా ఎంపానల్ అయ్యేందుకు రిటైర్డ్ న్యాయాధికారులు, సివిల్ న్యాయాధికారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఎంపానల్‌కు అభీష్టం ఉన్న న్యాయాధికారులు తమ దరఖాస్తులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని కోరారు. దరఖాస్తులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా ధికార సంస్థ పరిశీలించిన తరువాత చర్యలు నిమిత్తం పంపనున్నామన్నారు.

యథావిధిగా డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్ష

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఈనెల ఎనిమిదో తేదీన డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్ష (స్టాక్ మార్కెట్ ఆపరేషన్స్)ను యథావిధిగా నిర్వహించనున్నట్లు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల ఈ పరీక్ష జరుగుతుందని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.


ప్రశాంతంగా ఐసెట్

ఎచ్చెర్ల: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలక పాలెం), ఐతం (టెక్కలి), కోర్ టెక్నాలజీ (నరసన్నపేట)లో సోమవారం నిర్వహించిన ఏపీ ఐసెట్-2024 ప్రశాంతంగా జరిగింది. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహిం చారు. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్ట్‌లో 120కు 106 మంది, రెండో షిఫ్ట్‌లో 120కు 113 మంది హాజరుకాగా, 21 మంది గైర్హాజరయ్యారు.

మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి

రణస్థలం: మతిస్థిమితం లేని వ్యక్తిపై ఓ యువకుడు సోమవారం దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం సంభవించింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రణస్థలం పంచాయతీ పరిధిలోని పిట్టపాలేం గ్రామానికి చెందిన పిట్ట అప్పన్నకు కొన్నేళ్లుగా మతి స్థిమితంలేదు. రణస్థలంలోని పలువురు వాపారులు, మండల పరిషత్ ఉద్యోగుల వద్ద మంచిగా ఉండి జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పటిలాగే అప్పన్న తన గ్రామం నుంచి రణస్థలం చేరుకుని ఓ టీ స్టాల్ వద్ద టీతాగుతున్నాడు. అయితే అదే పంచా యతీకి చెందిన యువకుడు పిన్నింటి అయ్యప్ప టీ స్టాల్ వద్ద తన తండ్రి అప్పన్నపై పిడిగుద్దులతో దాడిచేసి గాయపరిచాడని కుమారుడు పిట్ట భాష తెలిపాడు. అప్పన్నను చికిత్స నిమిత్తం కొండములగాం సీహెచ్‌సీకి తరలించారు. ఊపిరి తీసుకోవడానికి అప్పన్న తీవ్ర ఇబ్బంది పడడం గమనించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కుమారుడు పిట్ట భాష ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిస్టు నాయకుడు శ్రీరాములు మృతి



బమ్మిడి శ్రీరాములు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: నగరంపల్లిలో తొలితరం కమ్యూనిస్టు నాయకుడు బమ్మిడి శ్రీరాములు (91) సోమవారం వేకువజామున మృతి చెందారు. 1934లో జన్మించిన శ్రీరాములు చిన్న తనం నుంచి సమస్యలపై పోరాట పంథా అలవరచుకున్నారు. నగరం పల్లి కేంద్రంగా పలాస ప్రాంతంలో అనేక ప్రజాతంత్ర ఉద్యమాలు నడిపారు. భార్య కరోనాతో మృతి చెందారు. ఆయన ముగ్గురు కుమారులు కూడా కమ్యూనిస్టు భావజాలం ఉన్న పార్టీలో పనిచేస్తున్నారు. కాగా నగరంపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీరాములు మృతికి మాజీ సర్పంచ్‌లు దువ్వాడ జయరాం చౌదరి, దువ్వాడ వెంకట కుమార్ చౌదరి, నాయకులు నెయ్యిల సూర్య నారాయణ, నెయ్యిల మోహనరావులతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

ఘనంగా మహా లింగార్చన



అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా మహా లింగార్చన ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు శివ పంచాయతన సహిత మహా లింగార్చన చేపట్టారు. కార్యక్రమంలో ఈవో ఎస్.చంద్రశేఖర్, అర్చకుడు ఇప్పిలిసాందీప శర్మ, వేద పండితుడు దర్భముళ్ల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

మందస: హరిపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అంబుగాం ఫీడర్‌లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక పక్క ఎండ వేడిమి, మరో పక్క విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. బాలిగాం, కమలాపురం, మఖరజోల తదితర గ్రామాల ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

12 మద్యం సీసాలు సీజ్

కంచిలి: అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం సీసాలను పట్టుకొని సీజ్ చేసి, నిందితుడి ని రిమాండ్‌కు తరలించామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైబీమ్ తెలిపారు. సోమవారం కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం జంక్షన్ వద్ద దుకాణంలో తనిఖీ చేపట్టగా పర్రి ప్రకాష్ రావు తన బడ్డీలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

నేడు సీఎం రోడ్‌షో

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఎం జగన్ మంగళవారం ఇచ్ఛాపురం లో పర్యటించనున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న హెలీ ప్యాడ్‌లో ల్యాండ్ అయి మధ్యాహ్నం 12 గంటలకు మునిసిపల్ కార్యాలయం కూడలిలో బస్సులో నుంచి రోడ్ షోలో పాల్గొంటారని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తెలిపారు. సీఎం రోడ్ షోకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

కొత్తూరు: బాధితులకు శ్రీభగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు అండగా నిలిచారు. కొత్తూరుకు చెందిన సాసుపిల్లి గంగు అనారోగ్యంతో ఏడాదిగా ఇంటికే పరిమితం కావడం తో బాధితునికి రూ.20 వేల చెక్ అందజేశారు. అలాగే ఒడిశాలోని కాశీనగర్ బ్లాక్ హడ్డు బంగికి చెందిన బాలింత కోనాడ జ్యోతిని భర్త తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జ్యోతి గర్భం దాల్చిన కొద్ది రోజులకే కిడ్నీ వ్యాధి బారినపడింది. వీరికి ఆరు నెలల చిన్నారి కూడా ఉంది. ఈ నేపథ్యంలో ట్రస్టు సభ్యులు రూ.10 వేలతో పాటు నిత్యావసర సరుకులు అందించారు.

నిధుల మళ్లింపుతో అన్యాయం

నందిగాం: సీఎం జగన్ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మళ్లించడంతో దళితులకు అన్యాయం జరిగిందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మాలమహానాడు ప్రతినిధి బోనెల అప్పారావు అన్నారు. పలు గ్రామాల్లో టీడీపీ తరఫున ప్రచారం నిర్వహించారు.

నీలమణిదుర్గ ఆలయ ఆదాయం రూ.5.51 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: స్థానిక శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి 42 రోజుల కు గాను రూ.551895 ఆదాయం వచ్చి నట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. దేవదాయ శాఖ ఏసీ కార్యాలయ ప్రతి నిధి రవికుమార్ పర్యవేక్షణలో ఆలయ ఆవరణలో హుండీలను సోమవారం తెరిచి లెక్కించారు. కార్యక్రమంలో ధర్మ కర్తలమండలి సభ్యులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా



హిరమండలం: హిరమండలంలోని అంబే ద్కర్‌నగర్ వీధిలో సోమవారం పంచాయతీ అధికారులు ట్యాంకర్‌తో తాగు నీటిని సరఫరా చేశారు. గత కొన్ని రోజులుగా కాలనీలో రక్షిత నీటి పథకం ద్వారా బురద నీరు వస్తుండడంతో ఈ నెల 5న మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు స్పందించి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు.

యువతే లక్ష్యంగా పనిచేయాలి: శిరీష



జనసేన నాయకులతో మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస: యువతే లక్ష్యంగా ఎన్నికల్లో పనిచేయాలని, వారి ప్రతి ఓటు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు పడేలా పాటు పడాలని ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు కొద్ది రోజులు మాత్రమే ఉన్నందున, ప్రతి నిమిషం విలువైందని అప్రమత్తంగా ఉండి కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. పలాసలో టీడీపీ విజయం ఖాయమన్నారు. అన్ని వార్డుల్లో టీడీపీకి బలమైన నాయకత్వం ఉందని, సూపర్ సిక్స్, మేనిఫెస్టోలను ఉమ్మడి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వాసుతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జోరువానలో సైతం ప్రచారం

పలాసరూరల్: కిష్టపురం గ్రామంలో కూటమి అభ్యర్థి గౌతు శిరీష సోమవారం జోరువానలో సైతం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కిష్టపురం గ్రామం చేరుకునేసరికి భారీ వడగళ్ల వర్షం కురిసినా ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, దువ్వాడ సంతోష్, జనసేన నాయకులు సంతోష్ పండా, వడ్డి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం: గోవిందరావు



ప్రచారం చేస్తున్న కూటమి అసెంబ్లీ అభ్యర్థి మామిడి గోవిందరావు

కొత్తూరు/పాతపట్నం: ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం కొత్తూరు మండలం కడుం, కడుంకాలనీ, హంస, బలద తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్‌తో పాటు కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన వెంటనే డీఎస్సీపై తొలి సంతకం చేస్తారన్నారు. నిత్యావసర సరుకులు ధరలు తగ్గించడంతో పాటు విద్యుత్ ధరలు పెరగకుండా చూడడం, మహిళకు ఉచిత బస్సు సదుపాయం, 50 ఏళ్ల నిండిన బీసీలకు రూ.4 వేలు పింఛన్ అందిస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి పోరా డుతున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుం డా కృషి చేస్తానన్నారు. గడచిన ఐదేళ్లలో ఉమ్మెల్యే ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: అశోక్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అశోక్

కంచిలి: తలతంపరం పంచాయతీకి చెందిన ధర్మ దొళాయి, శ్రీధర్ దొళాయి, భగవాన్ దొళాయి తదితరులకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే బెందాళం అశోక్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వా నించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్య క్రమంలో టీడీపీ నేతలు మాదిన రామారావు, బంగారు కురయ్య, మర్రిపాటి పూర్ణచంద్ర, సనపల కామేష్, బల్లెడ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురం-బాలకృష్ణాపురంలో ప్రచారం

ఇచ్ఛాపురం: ధర్మపురం, బాలకృష్ణాపురం పంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యే సతీమణి నిలోత్పల ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం ఉపాధి పనులు చేస్తు న్న కూలీల వద్దకు వెళ్లి టీడీపీ అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. వైసీపీ ప్రభుత్వం చేసిన మోసాలపై ఆమె ఓటర్లకు అవగాహన కలిగించారు. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్, ఎంపీగా కింజరాపు రామ్మోహన్‌నాయుడులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, కామేష్ నరేంద్ర, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాడుపల్లిలో చైన్ స్నాచింగ్

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామంలో సోమవారం చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జాడుపల్లికి చెందిన పద్మ కట్టెలు కొట్టేందుకు వెళ్లి వస్తుండగా గ్రామ సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని మూడుతులాల పుస్తెలతాడు తెంపుకుని పలాస వైపు వెళ్లి పోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ టి.రాజేష్ తెలిపారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాల ఉధృతికి నాంది

● అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క

కాశీబుగ్గ: ప్రజా సమస్యలపై గతనెల 14 నుంచి ప్రారంభించిన జనచైతన్య యాత్ర ఈనెల 5న ముగిసినప్పటికీ ఇది కేవలం ముగింపు కాదని, ఉద్యమాల ఉధృతికి నాంది అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క అన్నారు.సోమవారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎవరు గెలిచిన ప్రజా సమస్యలపై ఉద్యమాలు కొనసాగించాలన్నారు. ఈ యాత్ర నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు వివిధ సమస్యలపై బాధితులకు భరోసానిస్తూ అమరుల స్థూపాలకు నివాళి అర్పించామన్నారు. దేశంలో పదేళ్లుగా పాలిస్తున్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు బి.సుంకన్న, కరీంబాషా, సుజ్ఞానమ్మ జ్యోతి, సతీష్ కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విమలక్క

వైసీపీ ప్రచారంలో వలంటీర్

పలాస: పురుషోత్తపురం వార్డు కొండివీధిలో సోమవారం వైసీపీ ఎన్నికల ప్రచారంలో సూదికొండకాలనీ సచివాలయం వలంటీర్ టి.గంగాధర్ పాల్గొని కరపత్రాలు అందించడం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. వైసీపీ ప్రచారంలో అనేక మంది వలంటీర్లు ఇప్పటికే ప్రచారకర్తలుగా వ్యవహరిస్తున్నారని టీడీపీ ఆరోపిస్తోంది. దీనికి నిదర్శనంగా వైసీపీ నాయకులే సంబంధిత వీడియో, ఫొటోలు విడుదల చేయడంతో విషయం బయటపడింది. వలంటీర్లతో తాము ప్రచారం చేస్తాం.. ఇందులో తప్పేమీ ఉందని ఎదురు ప్రశ్నలు వేస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై ఎన్నికల నిఘా అధికారి టి.నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా వలంటీర్‌వ్యవహారం తన దృష్టికి వచ్చిందని, అధికారులకు తెలియజేస్తున్నామన్నారు.



గాలీవానతో ఎన్నికల ప్రచారం రద్దు

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు నంది గాం మండలంలో సోమవారం నవరబడగాం గ్రామంలో పర్యటిస్తుండగా గాలీవాన బీభత్సంతో తన ఎన్నికల ప్రచారాన్ని అర్థాంతరంగా రద్దుచేశారు. పలు గ్రామాల ప్రచారానికి వెళ్లాల్సి ఉన్నప్పటికీ విద్యుత్ అంతరాయం, ఉరుములు, మెరుపులు, వర్షపు జల్లులకు ఆయా గ్రామాల్లో ఎన్నికల పర్యటన రద్దు చేసుకున్నారు.